

# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

**SEPTEMBER - 2017**

సంవత్సర చందా రూ. 50/-

# బైబిలు లెక్చర్‌షిప్

## సత్యవాణి - కాకినాడ

| | | |
|---|---|---|
| స్థలము | : | క్రీస్తు సంఘము<br>7-9-35, సాంబమూర్తి వీధి,<br>సత్యవాణి, కాకినాడ - 533 004. |
| తేదీలు | : | 2017 నంబరు 7 నుండి 10వ తేదీ వరకు<br>మంగళ, బుధ, గురు, శుక్రవారములు |
| సమయం | : | ఉదయం 10.00 గంటలకు<br>మధ్యాహ్నం 2.00 గంటలకు<br>సాయంకాలం 7.00 గంటలకు |

ప్రఖ్యాతిగాంచిన స్వదేశ, విదేశ సహోదరులు వాక్యపరిచర్య చేయుదురు. భోజనం, వసతి ఉచితం. మొదటి దినమున రూ.20/-లు మాత్రము రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించవలెను. ఎవరి దారి ఖర్చులు వారే భరించవలెను. అందరికీ స్వాగతం. మీ కుటుంబ స్థానిక సంఘ సమేతముగా రండి, ఆత్మీయ విందులో పాల్గొనండి. మీ కొరకు ఎదురుచూచు చున్నాము.


బ్రదర్. జాషువా గూటం

బ్రదర్. రిక్కీ గూటం

Ph : 0884 - 2363722

98489 98547

# సత్యవాక్కు

THE WORD OF TRUTH

P.O. Box - 80, Kakinada, A.P. 533 001.

Ph : 0884-2363722 Cell : 98489 98547

Editor

JOSHUA GOOTAM

Pleading for Restoration of First Century Christianity

సంపుటి - 39 సెప్టెంబర్ - 2017 సంచిక -2

## పెద్దల కుండవలసిన బైబిలు అర్హతలు

## ( Biblical Qualifications for Elders )

గత సంచిక తరువాయి :

**తనయింటిని బాగుగా ఏలువాడు, తన పిల్లలను స్వాధీన పరచుకొనువాడు (1తిమోతి 3:4); విశ్వాసులైన పిల్లలు గలవాడు (తీతు 1:6)**

పెద్దగా యుండగోరువాడు "సంపూర్ణమాన్యత కలిగి తన పిల్లలను స్వాధీనపరచుకొనుచు తన యింటివారిని బాగుగా ఏలువాడై యుండవలెను" (1తిమోతి 3:4). మరియు విశ్వాసులైన పిల్లలు గలవాడై యుండవలెను (తీతు 1:6). అనగా అతని పిల్లలు నమ్మకమైన క్రైస్తవులై యుండవలెను.

ఒకే ఒక్క బిడ్డయుండినను అతడు 'విశ్వాసులైన పిల్లలు' గలవానిగా అర్హుడగును (ఆదికా21:2,7). సంఘ పెద్ద యింటిలో విధేయత గల పిల్లలుండాలని దేవుడు కోరు చున్నారు. వారి సంఖ్య సమస్య కాదు. మరల ఉన్నవారిలో ఒకరిద్దరు అవిశ్వాసులైనా అది పెద్దగా యుండుటకు అనర్హతకాదు. అయితే పెద్దలుగా ఏర్పాటు చేయబడబోవు వారిలో స్థానిక సంఘము నమ్మకము కలిగియుండాలి, బైబిలు అర్హతలు వారి కుండాలి (అపొ.కా. 6:3-6).

ఈ లేఖన భాగము ఒకడు సంఘపెద్దగా నియమింబడునాటికి

వారికున్న బిడ్డలు వారితో కాపురమున్న కాలమునే పరిగణించును. ఒకడు పెద్దగా యుండకముందుండవలసిన అర్హతలనే లేఖనములు ప్రస్తావించు చున్నవి (1తిమోతి 3:1-7; తీతు 1:5-9). అతడు "విశ్వాసులైన పిల్లలు గలవాడునైయున్న యెడల" అతని పెద్దగా నియమింపవచ్చునని తీతు 1:6 చెప్పుచున్నది. ఆ సందర్భమును 1 తిమోతి 3:4 వివరించు చున్నది : "సంపూర్ణమాన్యత కలిగి తన పిల్లలను స్వాధీనపరచు కొనుచు తన యింటి వారిని బాగుగా ఏలువాడై యుండ వలెను. ఎవడైనను తన యింటివారిని ఏలనేరకపోయిన యెడల అతడు దేవుని సంఘమును ఏలాగు పాలించును? (1తిమో3:4,5).

ఈ లేఖనభాగమును బట్టి సంఘ పెద్దలలో యుండగోరువాడు తన యింటివారిని బాగుగా నడిపించు వాడైయుండవలెను. క్రైస్తవులైన పిల్లలు గలవాడైయుండవలెను. ఒక మనుష్యుని ఇంటి వారి ప్రవర్తనను బట్టి అతడు సంఘ వ్యవహారములను సరిగ చక్కబెట్టగలడో లేదో గ్రహించుకొన వచ్చును. తన యింటిని బాగుగా నడిపించగలిగిన యెడల అతడు సంఘమును కూడ బాగుగా నడిపించ గలడు. పెద్దయైనవాడు తన పిల్లలను స్వాధీనములో యుంచుకొన వలెను. వారతనకి విధేయులైయుండ వలెను. అవిధేయులైన పిల్లలు సంఘపు పనికి అడ్డుబండగా యుందురు. తన బిడ్డలను క్రమశిక్షణలో యుంచ లేనివాడు సంఘపెద్దగా యుండుటకు అనర్హుడు.

ఒక మనుష్యుని యొక్క పిల్లలు పెద్దవారై గృహమును విడిచి తమ స్వంత జీవితమును జీవించుచు యుండవచ్చును. అట్టివానిని పెద్దగా నియమింపవచ్చునా? సహజముగా పెద్దగా యుండగోరువాడు విశ్వాసులైన పిల్లలను కలిగియుండవలెననునది విదితమే (తీతు 1:6). అతని పిల్లలు తన యింటిలో యుండగా వారి పరిస్థితి అట్లుండవలెను. తన పిల్లలు యింట యున్నప్పుడే ఒకడు తన యింటివారిని బాగుగా ఏలివాడై యుండునుగదా. ఒకని యింటిని సరిగనడిపించు విధానమును బట్టి దేవుని గృహమైన సంఘమును కూడ ఒకడు బాగుగా నడిపించును (1తిమో 3:1-7; తీతు 1:5-9).

ఒకడువిశ్వాసులైన పిల్లలు కలిగి వారుతనతో జీవిస్తుయున్నప్పుడు

సహజముగా సంఘపెద్దగా నియమింప వచ్చును. అయితే అతని పిల్లలు పెద్దవారై తమ సంసార జీవితమును తామే జీవించనెంచి అతని నుండి వేరైపోయినను కూడ అతడు పెద్దగానే కొనసాగవచ్చును. తదుపరి వయస్సులో పెద్దవారైన వాని పిల్లలు పాపముచేయగా తండ్రియైన వాడు పెద్దగా యుండకుండ రిజైన్‌చేయవలె నని లేఖనములు చెప్పుటలేదు, వయస్సు వచ్చిన వారి సంతతి మీద తల్లిదండ్రులకు కంట్రోలు వుండదు. పెరిగి పెద్దయైన వారు తమ స్వేచ్ఛను కలిగియున్నారు. సహజముగా వారి పెరుగుదల దేవుని వాక్యము చొప్పుననే ఉండియుండును (సామె 22:6).

ఒక పెద్దను ప్రశ్నింపదగిన లేఖనభాగము, సందర్భము ఒకే ఒకటి యున్నది. అది అతని జీవితంలో యున్న పాపమును గూర్చినట్టిది. "ఇద్దరు ముగ్గురు సాక్షులుంటనే గాని పెద్దమీద దోషారోపణ అంగీకరింపకుము. ఇతరులు భయపడు నిమిత్తము పాపము చేయువారిని అందరి యెదుట గద్దింపుము" (1తిమోతి 5: 19,20). లేఖనముల ప్రకారము పెద్ద యొక్క పిల్లలందరు అవిశ్వాసులుగా తయారైతే అది వానిని పెద్దగా యుండుటకు అనర్హుడుచేయదు. పెద్ద జీవితంలో పాపంఉంటే అది వేరే సమస్య. అయితే పెద్దయొక్క పిల్లలందరు అవిశ్వాసులైతే, సహజముగా వారి పెంపుదలలోనో, వారి స్వగృహములోనో ఏదో ఒక లోసుగు ఉండియుండ వచ్చును. వారు తండ్రియొక్క స్వాధీనములో పెరుగలేదు. యిట్టి సందర్భములో ఆ పెద్దగాని, వాని స్థానికసంఘము గాని అతని పెద్దలలో నుండి విరమింపజేయాలి.

తన యింటివారిని బాగుగా ఏలుటలో భార్యభర్తల సంబంధమును సరియైన రీతిగా కొనసాగించుకొనుట ఇమిడియున్నది. తన కుటుంబమునకు యజమాని (శిరస్సు) కాని మనుష్యుడు దేవుని సంఘనాయకుడుగా యుండలేడు. అధికారము చెలాయించు వదరబోతు భార్య మంచిభర్తను పెద్దగా యుండ కుండా అడ్డుకొనును. గనుక ఒకని భార్యబిడ్డలతో అతడు పెద్దగాయుండు టకు సహాయపడవలెను.

**స్వేచ్ఛాపరుడు కాకూడదు (తీతు 1:7).**

స్వేచ్ఛాపరుడు కాకకూడదు అంటే అజ్ఞాని కాకూడదు అని యర్థము. విశ్వాస నియమములు

విషయమై అతడు రాజీపడని వాడు గాని మొండివాడు కాదు, స్వీయ అభిప్రాయము కలవాడుకాదు. అయోగ్యమైన విషయాల్లో లొంగి పోవువాడు కాకూడదు (2 యోహాను: 9-11వ). స్వేచ్ఛాపరుడైన వాడు ఒకే ఒక్క మనుష్యుని పాలన సమర్ధిస్తాడు, ఆ ఒకే ఒక్కడు తానైయుండాలను కొంటాడు. స్వేచ్ఛాపరుడు పెద్ద వాడైనను పిల్లవాని స్వభావము గలవాడు అట్టివాడు పెద్దగా యుండ తగదు.

**ముక్కోపి కాకూడదు (తీతు 1:7) :**

పెద్దగాయుండువాడు కోపపడు వాడుకాదు, మరియు ముక్కు చివరనే కోపమున్నవాడు కాకూడదు. అతడు ఆగ్రహావేశములతో నిండుకొనకూడదు. పెద్దలు ప్రశాంత మనస్తత్వము శాంతి యుత స్వభాముగలవారు. వారు కోపోద్రేక్తులు అస్సలేకారు. ఏదైనా సంభాషణ జరుగనప్పుడు ఆవేశముకు గురిగాక శాంతయుతంగా ఆలోచించు వారై యుండువారు.

**సజ్జనప్రియుడు (తీతు 1:8) :**

సజ్జన ప్రియుడు, మంచిని మంచివారిని ప్రేమించువాడు. అతడు అందరిలోను మంచిని చూస్తాడు మంచిని ప్రేమిస్తాడు. సువార్తికులను బైబిలు ఉపదేశకులను, పరిచారకులను అందరిని ప్రేమిస్తాడు, అందరిచేత ప్రేమించబడ్తాడు. పాపమును, పాప కార్యములను అభ్యసించువారు, ప్రేమించువారు మరణమునకు తగినవారని అపొ.పౌలు రోమా 1:32 లో తెలియజేసాడు, సంఘపెద్దలు మంచిని ప్రేమిస్తారు. అవినీతిని ద్వేషిస్తారు.

**నీతిమంతుడు (తీతు 1:8) :**

నీతిమంతుడనగా నీతిని జరిగించువాడు. పెద్దయైనవాడు నిష్పక్షపాతి, యదార్ధవంతుడు. అక్రమము చేయనివాడు.

**ఆశానిగ్రహము గలవాడు (తీతు 1:8) :**

అనగా తన కోరికలను అదుపులో యుంచుకొన్నవాడు. పెద్దయైనవాడు అక్రమ కార్యములను చేయడు, అక్రమ కోరికలను కలిగిన వాడు కాదు. నిగ్రహ బుద్ధిగలవాడు. తన్నుతాను అదుపులో యుంచుకొన్న వాడు. క్రమశిక్షణ గలవాడు.

**- లూయిస్ రష్మోర్**

# సిలువపైనున్న దొంగ

## (The Thief on the Cross)

యేసుక్రీస్తు మృతులలో నుండి సజీవుడై లేచి తన అపొస్తులులనిట్లు ఆజ్ఞాపించెను : "మీరు సర్వలోకము నకు వెళ్ళి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి. నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును; నమ్మని వానికి శిక్ష విధింపబడును" (మార్కు 16:15,16). యేసుక్రీస్తు యిచ్చిన ఈ గొప్ప ఆజ్ఞలో విశ్వాసముతో బాటు బాప్తిస్మముకూడ ప్రాముఖ్యమని మనము గ్రహించుకొనగలము. ఒకడు రక్షింపబడుటకు బాప్తిస్మము అవుసరమని బోధింపబడుచుండగా, యేసుక్రీస్తుతో కూడ సిలువ వేయబడిన ఒక దొంగ బాప్తిస్మము పొందకుండగనే రక్షింపబడెనుగదా? అతని సంగతి యేమిటి? అని కొందరు ప్రశ్నింతురు. అందువలన బైబిలులో మనము బాగుగా యెరిగిన వ్యక్తులలో క్రీస్తుతో కూడ సిలవ వేయబడిన దొంగ ఒకడు.

నిజానికి ఆరోజున యేసుతో కూడ యిద్దరు నేరస్థులు సిలువ వేయబడిరి (లూకా 23:32). వారు బందిపోటు దొంగలు. మొదట వారిద్దరు యేసును నిందించిరి. "వారిలో ఒకడు ఆయనను దూషించుచు నీవు క్రీస్తువుగదా? నిన్ను నీవు రక్షించుకొనుము, మమ్మును కూడ రక్షించుమని చెప్పెను. అయితే రెండవవాడు వానిని గద్దించి – నీవును అదే శిక్షావిధిలో ఉన్నావు గనుక దేవునికి భయపడవా? మనకైతే యిది న్యాయమే; మనము చేసిన వాటికి తగిన ఫలము పొందుచున్నాము గాని ఈయన ఏ తప్పిదమును చేయలేదని చెప్పి, ఆయనను చూచి–యేసూ, నీవు నీ రాజ్యములోనికి వచ్చునప్పుడు నన్ను జ్ఞాపకము చేసికొనుమనెను. అందుకాయన వానితో నేడు నీవు నాతోకూడ పరదైసులో యుందువని నిశ్చయముగా నీతో చెప్పుచున్నాననెను (లూకా 23:39–43). ఈరెండవ నేరస్థుడు యేసును బాగుగా యెరిగి యుండవచ్చును. యేసును గూర్చి అతడు సత్యమునే చెప్పెను. ఆయన ఏ తప్పిదమును చేయలేదు అని అతి త్వరలో చనిపోబోవుచున్న యతడు గొప్ప సాక్ష్యమిచ్చెను.

రక్షింపబడుటకు బాప్తిస్మము పొంద నవుసరములేదని అనుకొను వారు, యీ నేరస్థుడు బాప్తిస్మము పొందలేదుకదా, అయినను యేసు అతనిని రక్షించెను అని తలంచు చుందురు. ఒకడు రక్షింపబడుటకు యేమిచేయవలెనని ప్రభువు చెప్పెను? అని వారు తలంచరుగాని, సిలువ పైనున్న ఈ దొంగను ఒక సాకుగా చూపింతురు. అది బహు విచారకరము.

నిజానికి ఆదొంగ బాప్తిస్మము పొందెననిగాని, పొందలేదనిగాని మనము నిరూపించలేము. క్రీస్తు యొక్క మార్గమును సరాళము చేయుచు బాప్తిస్మమిచ్చు యోహాను ముందుగా వచ్చెను. అతడు యూదులకు పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మమిచ్చుచుండెను. "ఆ సమయమున యెరూషలేము వారును, యూదయవారందరును, యొర్దానునదీ ప్రాంతముల వారందరును అతని యొద్దకు వచ్చి తమ పాపములు ఒప్పుకొనుచు యొర్దాను నదిలో అతనిచేత బాప్తిస్మము పొందు చుండిరి"యని మత్తయి 3:5,6లో వ్రాయబడి యున్నది. గనుక ఈ దొంగ యోహానుచే బాప్తిస్మము పొందినవాడై యుండవచ్చును. బాప్తిస్మము పొందిన తరువాత నేరస్థునిగా అతడు తయారై యుండవచ్చును. లేదా అతడు బాప్తిస్మము పొంది యుండక పోవచ్చును. యేసు అతని పాపములు క్షమించెను. నేడు నీవు నాతో పరదైసులో యుందువని అతనితో ఆయన చెప్పెను.

తరువాత, మనము గ్రహించ వలసిన సంగతి మరొకటి యేమంటే, ఆ దొంగ మోషే ధర్మశాస్త్రము అమలులో యున్న కాలములో జీవించెను. క్రీస్తు కూడ అట్లే మోషే యుగ కాలములో జీవించెను. మోషే యుగములో ఉంటూ యేసు అనేక పాపములను క్షమించెను. "పాపములు క్షమించుటకు భూమిమీద మనుష్య కుమారునికి అధికారము కలదని మీరు తెలిసికొనవలెనని ఆయన మత్తయి 9:6లో బోధించెను. అట్లు బోధించుటయే కాదు, ఆయన అనేకుల పాపములు క్షమించి తన అధికారమును నిరూపించెను.

క్రీస్తు సిలువపై మరణించక ముందు ఆ దొంగ జీవించెను.

"యేసూ, నీవు నీరాజ్యములోనికి వచ్చునప్పుడు నన్ను జ్ఞాపకము చేసికొనుమని" అతడు ప్రభువును వేడుకొను సరికి ఆయన ఇంకను ఈలోక పాపములకొరకై మరణించ లేదు. క్రొత్త నిబంధన అమలులోనికి ఇంక రాలేదు.

క్రీస్తు సిలువపై మరణించి నప్పుడు కొత్త నిబంధనను ఆయన తన రక్తముతో ముద్రవేసెను. "శాసనమును వ్రాసిన వాడు మరణము పొందితేనే అది చెల్లును; అది వ్రాసినవాడు జీవించుచుండగా అది ఎప్పుడైనను చెల్లునా?" అని వ్రాయబడి యుండుట మనము చూడగలము (హెబ్రీ 9:17). గనుక క్రీస్తు చనిపోవక ముందు నీ పాపములు క్షమింపబడి యున్నవి అని చెప్పుటకు ఆయనకు అధికారముండెను. అయితే ఆయన చనిపోయిన తరువాత ఆయన శాసనము అమలులోనికి వచ్చెను. ఆయన దొంగకు ఒకటి చెప్పినను, అపొస్తులులకు మాత్రము "మీరు సర్వలోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి; నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును; నమ్మని వానికి శిక్ష విధింపబడును" అని చెప్పెను. యేసు ఈ ఆజ్ఞను ఎప్పుడు యిచ్చెను? ఆయన మరణమునకు ముందా? వెనకా? ఆయన మరణించిన తరువాతనే గదా? క్రీస్తు మరణించగానే క్రొత్త నిబంధన అమలులోనికి వచ్చెను. క్రొత్త నిబంధన ప్రకారము ఒకడు రక్షింపబడ వలెనంటే క్రీస్తుసువార్తను నమ్మవలెను. బాప్తిస్మము పొందవలెను, లేనియెడల శిక్ష విధింప బడును. నాటి నుండి నేటి వరకు నీటి బాప్తిస్మము పొందకుండ రక్షింపబడిన వాడెవడును మనకు క్రొత్తనిబంధనలో కన్పించుటలేదు.

యేసు యొక్క అపొస్తులులు ప్రపంచ మంతటా సంచారము చేసిరి. ప్రభువు వారినేమైతే ఆజ్ఞాపించెనో దానినే వారు బోధించిరి. రక్షణ మార్గమును బోధించుటలో ఒక్కసారి కూడ వారు సిలువపైనున్న దొంగను మాదిరిగ చూపించలేదు. అపొస్తులుల కార్యములు అను పుస్తకమంతటిని మనము చదివిన యెడల ప్రభువు వారికాజ్ఞాపించిన దానినే వారు బోధించినట్లు మనము చూడగలము. దాని ఫలితార్థముగ ప్రజలు విశ్వసించిరి. మారుమనస్సు పొందిరి

క్రీస్తును ఒప్పుకొనిరి. వారి పాప క్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందిరి.

**యేసుక్రీస్తు యొక్క క్రొత్త నిబంధన మార్పు చేయబడదు.** పాప క్షమాపణ నిమిత్తము మనమేమి చేయవలెనో, అపో.కా. 2:38లో అది యిట్లు చెప్పుచున్నది. "మీరు మారు మనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరమును పొందుదురు". క్రీస్తు యిచ్చు ఈ ఆజ్ఞను మనము అపార్థము చేసికొనలేము. అది సులభమైనది, తేలికయైనది.

క్రీస్తు పునరుత్థానుడై లేచిన నాటి నుండి క్రీస్తు మరల వచ్చువరకు ప్రజలకు మారుమనస్సును, పాప క్షమాపణయు ప్రకటింపబడవలెనని దేవుని ఆజ్ఞయైయున్నది (లూకా 24:47). గనుక మన రక్షణార్థమై సిలువపై నుండిన దొంగను మాదిరగ చేసికొని బాప్తిస్మము విషయములో వెనుకాడలేము. అది మంచిది కాదు. అతడు ఏ చట్టము క్రింద జీవించెనో దాని ప్రకారము తీర్పు పొందును. నీవు నేను అయితే క్రీస్తు చట్టప్రకారము తీర్పు పొందుదుము. క్రీస్తు చట్టము ఏమి చెప్పు చున్నది? "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడునని" చెప్పుచున్నది. మరల మన ప్రభువైన యేసు ఏమి చెప్పుచున్నారు? "నన్ను నిరాకరించి నా మాటలు అంగీకరింపని వానికి తీర్పు తీర్చు వాడొకడు కలడు; నేను చెప్పిన మాటయే అంత్యదిన మందు వానికి తీర్పు తీర్చును" (యోహాను 12 : 48).

మనము రక్షింపబడవలెనంటే విశ్వాసము ఒక్కటేగాని లేక బాప్తిస్మము ఒక్కటేగాని చాలునని వేము బోధించుట లేదు. క్రొత్తనిబంధన అట్లు బోధించుట లేదు. నీ విశ్వాసముతో బాటు విధేయతను దేవునికి కనుపరచుము. తనకు విధేయులైన వారికే ఆయన నిత్యరక్షణకు కారకుడు. నమ్మనొల్లని వారికి ఆయన తప్పక శిక్ష విధించును. నీవు క్రీస్తు నందు విశ్వసించి ఇంకను బాప్తిస్మము పొందని యెడల తక్షణమే ఆ పనిని జరిగించి క్రీస్తులోను, ఆయన సంఘములోను ప్రవేశించుము.

**-జాషువా గూటం**

# సిలువపైనున్న దొంగ బాప్తిస్మము పొందెనా?

## ( Was the thief on the cross Baptised? )

నీవెప్పుడైనా దొంగను చూచావా? నీవెప్పుడైనా దొంగల బారిన పడ్డావా? ఏమైనా కోల్పోయవా? అట్లయితే దొంగను ప్రేమించడం కష్టమే.

ఒక సందర్భములో యేసు ఒక దొంగకు తన ప్రేమను ప్రకటించారు. "నేడు నీవు నాతో కూడ పరదైసులో యుందువని" ఆయన అతనికి చెప్పారు.

బాప్తిస్మము పొందకుండా రక్షింప బడవచ్చునని కొందరు ఈ దొంగ యొక్క ఉదాహరణ మనకు చెబుతారు. "నమ్మి బాప్తిస్మము పొందిన వాడు రక్షింపబడునని" ఆయన మార్కు 16:16లో చెప్పినను వారు ఆ దొంగను చూడండియని అంటారు.

ఆ దొంగ బాప్తిస్మము పొందాడా? అతడు బాప్తిస్మము పొందిన విశ్వాసియని ఒకాయన చెప్పారు. బైబిలును చదివితే అతడు బాప్తిస్మము పొందాడని చెప్పడానికే ఎక్కువ రుజువులున్నాయి. అతడు బాప్తిస్మము పొందియుండవచ్చు అనడానికి 5 రుజువులను గమనించుము.

**1. అతడు బాప్తిస్మము పొందలేదని బైబిలు చెప్పుటలేదు.**

అతడు దొంగ దోచుకొనువాడు, పాపియని బైబిలు అతని వర్ణించు చున్నది. నేనొకపాపిని, బాప్తిస్మము పొందిన విశ్వాసిని. అలాగే ఆ దొంగ బాప్తిస్మము పొందిన విశ్వాసియగు పాపియైయున్నాడు.

**2. ఆ దొంగ దేవునికి భయపడిన వాడు.**

ఇంకొక దొంగ యేసును నిందిస్తుయుంటే అతని గద్దించి "నీవు కూడ అదే శిక్షావిధిలో యున్నావు గనుక దేవునికి భయపడవా?" యని చెప్పాడు (లూకా 23:40).

**3. ఆ దొంగ పరలోక రాజ్యమును గ్రహించుకొన్నాడు :**

అతడు ఆయనను చూచి, "యేసూ నీవు నీ రాజ్యములోనికి వచ్చినప్పుడు నన్ను జ్ఞాపకము చేసికొనుమనెను" (లూకా 23:42). యేసు భూ సంబంధమైన రాజ్యమును స్థాపించునని అనేకులు తలంచారు (నేడును కొందరు అట్లే తలస్తారు). అయితే యేసుయొక్క ఆత్మీయ రాజ్యమును గూర్చి అతనికెట్లు తెలుసు? బహుశా అతడు యేసుబోధలను విన్నాడు, సరిగ్గా అర్ధము చేసికొన్నాడు.

**4. ఆ దొంగ రెండవ నేరస్థుని గద్దించాడు :**

మత్తయి 27:44లోను మార్కు 15:32లోను ఆ యిద్దరు నేరస్థులు యేసును దూషించినట్లు చెప్పబడినది. అయితే సిలువ మీద వ్రేలాడుచు చనిపోబోతున్న వానికి క్రైస్తవ మనస్తత్వము యేమీవుండదు. అయితే లూకా 23:40లో అతడు ఇంకొక నేరస్థుని యేసును గూర్చి గద్దించి నట్లు చెప్పబడినది. యేసు యొక్క ప్రభావము అతని జీవితంలో యేమీ ఉండకపోతే అతడు రెండవ వానిని ఎందుకు గద్దిస్తాడు?

**5. తాను పాపము చేసినట్లు ఆ దొంగ ఎరుగును :**

"మనకైతే యిది న్యాయమే; మనము చేసిన వాటికి తగిన ఫలము పొందుచున్నాము. గాని యీయన ఏ తప్పిదమును చేయలేదు" అని అతడు చెప్పాడు (లూకా 23:41). ఆ దొంగ ఇక్కడ మారుమనస్సు పొందుచుండెనా?

పరిసయ్యులు "యోహాను కంటె యేసు ఎక్కువమందిని శిష్యులనుగా చేసికొని వారికి బాప్తిస్మమిచ్చుచున్న సంగతి" వినిరియని యోహాను 4:1లో చెప్పబడినది. యెహాను ఎంతమందికి బాప్తిస్మమిచ్చెను? మనకు తెలియదు. మత్తయి 3:5-6ను బట్టి అనేకులు బాప్తిస్మము పొందారు గాని యేసు అంతకంటే ఎక్కువమందికి బాప్తిస్మమిచ్చెను. ఆలాగున బాప్తిస్మము పొందిన వారిలో ఈ దొంగ లేడని ఎవరు చెప్పగలరు?

- కీత్ పార్కం

# అందము మోసకరము, సౌందర్యము వ్యర్థము"

## (Charm is deceitful, Beauty is Vain)

నోవహు దినములు చెడుతనముతో నిండియున్నవి. ఆ తరమంతా దుర్మార్గమైనది. వారి జీవితాలలో దేవునికి స్థానం లేదు. "జల ప్రళయమునకు ముందటి దినములలో నోవహు ఓడలోనికి వెళ్లిన దినము వరకు వారు తినుచు త్రాగుచు పెండ్లి చేసికొనుచు పెండ్లికిచ్చుచు నుండిరి" అని యేసుప్రభువు చెప్పారు (మత్తయి 24:38). ఆ తరమంతా చెడిపోయి, దుర్మార్గమేయినది. చెడిపోయిన, దుర్మార్గమైన ఈ ప్రజలు ఎవరు? వారు దేవుని కుమారులు, దేవుని పిల్లలు (సేతు సంతానమైన గిబ్బోరిమ్). నరుల కుమార్తెలు (నెఫిలీలు, కయీను సంబంధులు). దేవుని వాక్యము చెబుతుంది. - "నరులు భూమిమీద విస్తరింపనారంభించిన తరువాత కుమార్తెలు వారికి పుట్టినపుడు, దేవుని కుమారులు నరుల కుమార్తెలు చక్కని వారని చూచి వారందరిలో తమకు మనస్సుకు వచ్చిన స్త్రీలను వివాహము చేసికొనిరి. అప్పుడు యెహోవా- నా ఆత్మ నరులతో ఎల్లప్పుడును వాదించదు, వారు తమ అక్రమ విషయములో నరమాత్రులైయున్నారు. అయినను వారి దినములు నూట ఇరువది యేండ్లగుననెను. ఆ దినములలో నెఫిలీలను వారు భూమి మీద నుండిరి, తరువాతను ఉండిరి. దేవుని కుమారులు, నరుల కుమార్తెలతో పోయినపుడు వారికి పిల్లలను కనిరి. పూర్వకాలమందు పేరు పొందిన శూరులు వీరే. నరుల చెడుతనము భూమిమీద గొప్పదనియు, వారి హృదయము యొక్క తలంపులలోని ఊహ అంతయు ఎల్లప్పుడు కేవలము చెడ్డదనియు యెహోవా సంతాపము నొంది తన హృదయములో నొచ్చుకొనెను. అప్పుడు యెహోవా - నేను సృజించిన నరులును నరులతో కూడ జంతువులును పురుగులును ఆకాశ పక్ష్యాదులును భూమి మీద నుండకుండ తుడిచి వేయుదును; ఏలయనగా నేను వారిని సృష్టించినందుకు సంతాపము నొందియున్నాననెను. అయితే నోవహు

యెహోవా దృష్టియందు కృప పొందిన వాడాయెను" (ఆది 6:1-8).

చక్కని వారైన నరుల కుమార్తెలు వారి పిల్లలను దేవుని భయములో తర్ఫీదు చేయలేకపోయిరి. అన్యులతో ఏ విధమైన వైవాహిక సంబంధాలు ఏర్పరచుకొన కూడదని దేవుడు ఇశ్రాయేలీయులకు ఆజ్ఞాపించారు. "నీవు వారితో వియ్యమందకూడదు, వాని కుమారునికి నీ కుమార్తెను ఇయ్యకూడదు, నీ కుమారునికి వాని కుమార్తెను కొనకూడదు. నన్ను అనుసరింపకుండ ఇతర దేవతలను పూజించునట్లు నీ కుమారుని వారు మళ్లించుదురు, అందును బట్టి యెహోవా కోపాగ్ని నీ మీద రగులుకొని ఆయన నిన్ను త్వరగా నశింపజేయును" (ద్వితి 7:3,4; 32:18, 46).

బాల్యము నుండి వారు దేవుని భయములో పెంచబడలేదు గనుక పిల్లలు దుర్మార్గులై చెడిపోయిరి. "బాలుడు నడువ వలసిన త్రోవను వానికి నేర్పుము వాడు పెద్దవాడైనపుడు దాని నుండి తొలగిపోడు" (సామె 22:6). మరియు బిడ్డలను గూర్చి ఆయన ఇలా ఆజ్ఞాపించారు - "నీవు నీ కుమారులకు వాటిని అభ్యసింప జేసి, నీ యింట కూర్చుండునపుడును త్రోవను నడుచునపుడును పండుకొనునపుడును లేచునప్పుడును వాటిని గూర్చి మాటలాడవలెను, సూచనగా వాటిని నీ చేతికి కట్టుకొనవలెను. అవి నీ కన్నుల నడుమ బాసికము వలె నుండవలెను. నీ యింటి ద్వారా బంధముల మీదను నీ గవునుల మీదను వాటిన్ని వ్రాయవలెను (ద్వితి 6:7-9).

పౌలు ఎఫెసీయులకు ఇలా వ్రాస్తున్నాడు - "తండ్రులారా! మీ పిల్లలకు కోపము రేపక ప్రభువు యొక్క శిక్షలోను బోధలోను వారిని పెంచుడి" (ఎఫెసి 6:4). "నేనును నా యింటి వారును యెహోవాను సేవించెదము" అని యెహోషువా అన్నాడు (యెహోషువ 24:15).

అబ్రహాము గాని ఇస్సాకు గాని తమ కుమారులు కనాను స్త్రీలను వివాహమాడాలని తలంచ లేదు (ఆది 24:3; 28:1). ఏశావు హేతు.

కుమార్తెలను (కనానీయులు) వివాహమాడాడు, వారు ఇస్సాకు రిబ్కాలకు సంతోషం కలిగించలేదు (ఆది 24:46; 28:8). లోతు సొదొమ గొమొర్రాల నుండి తన భార్యను తెచ్చుకున్నాడు. ఆమె తరువాత ఉప్పు స్తంభమైపోయింది. శూరుడైన సమ్సోను ఫిలిష్తీయ స్త్రీలతో సంబంధం కలిగి ఉన్నాడు. వారే తరువాత తన పతనానికి కారణమైనారు (న్యాయా 14:1-3; 16వ అధ్యాయము). భూమి మీద గొప్పజ్ఞాని అయిన రాజు మీద దేవుని కోపము రవులుకొంది. రాజైన సొలొమోను అన్యులైన భార్యలు అతని హృదయమును అన్యదేవతల తట్టు త్రిప్పినందువల్ల అతని పాపముల వల్ల ఇశ్రాయేలు రాజ్యము విభజింపబడింది. సీదోనీయుల రాజైన ఎత్బయలు కుమార్తెయైన యెజెబెలును రాజైన ఆహాబు వివాహం చేసికొని బయలు దేవతను పూజించుచు వానికి మ్రొక్కుచుండెను (1 రాజులు 16:31, 32; 22 అధ్యాయం). అన్యులైన తమ భార్యలను వారికి పుట్టిన బిడ్డలను విడిచిపెట్టమని బబులోను నుండి తిరిగి వచ్చిన ఇశ్రాయేలీయులకు ఎజ్రా, నెహెమ్యాలు పిలుపు నిచ్చారు (ఎజ్రా 10:10-44).

అన్యులైన కొందరు స్త్రీలు తమ పిల్లలను దేవుని భయములో పెంచినట్లు మనము చదువుతాము. ఉదా: రాహాబు, రూతు వారు యేసుక్రీస్తు ప్రభువు వంశావళిలో స్థానం పొందారు. "అందము మోసకరము - సౌందర్యము వ్యర్థము. యెహోవా యందు భయ భక్తులు కలిగిన స్త్రీ కొనియాబడును" ఇది ఖచ్చితము (సామె 31:30). చక్కని వారైన నెఫిలీల కుమార్తెలు వారి బిడ్డలకు దేవుని భయమును బోధింపలేకపోయారు. మొత్తం తరం అంతా చెడిపోయింది, దుర్మార్గమయింది. దేవుడు ఆ తరమంతటిని నాశనం చేసారు గాని నోవహు యెహోవా దయను పొందాడు. అతడు తన కుటుంబము మాత్రమే జలప్రళయం నుండి రక్షింపబడ్డారు.

"మీరు అవిశ్వాసులతో విజోడుగా ఉండకుడి" (2 కొరింథి 6:14).

**కబిత గూటం**

# నిజ క్రైస్తవ్యము యేమికాదు

## ( What True Christianity is Not )

యేసు ప్రభువును వెంబండించు వారి మతము క్రైస్తవ్యము. యేసు ప్రభువు యొక్క మరణము, సమాధి, పునరుత్థానముల పర్యవసానము క్రైస్తవ్యము.

అయితే యేసును వెంబడించు వారమని చెప్పుకొనే కొందరు నిజానికి ఆయన బోధనలను బట్టి నడుచుకోరు, ఆయన మాదిరిని బట్టి జీవించరు. యిది విచారకరము. సరిగదా క్రీస్తు మార్గమునకు భిన్నమైన రీతిగా వారు ప్రవర్తించుదురు. అయితే క్రీస్తుకు మహిమ తెచ్చురీతిగా వారు జీవించుట యుక్తము.

నిజక్రైస్తవ్యమునకు, మతశాఖల క్రైస్తవ్యమునకు యున్న భేదమును ప్రజలు ఎరుగరు. క్రైస్తవులమని చెప్పుకొనేవారు క్రీస్తు బోధకు భిన్నముగా ప్రవర్తించి వార్తలలోనికి ఎక్కినప్పుడు, సత్యము నెరుగని వారు క్రైస్తవులు అందరు అట్లే జీవిస్తారని తలస్తారు.

అయితే నిజక్రైస్తవ్యము యేమి కాదో తెలియజెప్పుటకు ఈ వ్యాసమును వ్రాయుచున్నాను. సువార్తను తమ లాభసాటికి ఆయుధముగా వినియోగించువారికి, తమ రాజకీయ మనుగడకు సువార్తను వినియోగించుకొను వారికి యిది ఒక జవాబు.

క్రైస్తవ్యమునకు ప్రభుత్వమునకు యేమీపొందికలేదు. క్రైస్తవ్యము రాజకీయము కాదు; రాజ్యాధికారము కాంక్షించదు. ఎవరిమీదనైనను పెత్తనము చెలాయించదు. క్రీస్తు యొక్క బోధలు మనము వినయ విధేయతలు కలిగి యుండాలని హెచ్చరించుచున్నవి. "ఘనత విషయములో ఒకనినొకడు గొప్పగా ఎంచుకొనుడి" యని వాక్యము మనలను హెచ్చరించుచున్నది (రోమా 12:10).

నిజ క్రైస్తవ్యము ప్రజా ప్రభుత్వము గాని, ఏకఛత్రాధిపత్యము గాని కోరుకొనదు. కమ్యూనిస్టుల దేశములలోను క్రైస్తవ్యము మనుగడ సాధించును. నిజానికి క్రైసరులు

పాలించు సమయములో క్రైస్తవ్యము ఆరంభమయ్యింది.

నిజ క్రైస్తవ్యము దాని అనుచరులు స్వతంత్రులేమి, బానిసలేమి యజమానులు తమ బానిసలను బాగుగా చూచుకొనవలెనని, బానిసలు తమ యజమానులకు మంచిగా పనిచేయాలని బోధింతురు (కొలస్స 3, 4 అధ్యాయము)

**ఒకడు ధనికుడైనా, పేదవాడైనా** క్రైస్తవ్యము లెక్క చేయదు. యదార్ధముగా సంపాదించిన ధనమును అది ఖండించదు. అయినను నిరుపేదయైన వాడు కూడ క్రైస్తవుడుకావచ్చును. లేదా గొప్ప సంపన్నపరుడు కూడ క్రైస్తవుడు కావచ్చును. యాకోబు 2లో పేదలకు, సాదలకు కూడ యాకోబు వ్రాసాడు.

నిజ క్రైస్తవ్యములో **జాతి భేదములు లేవు.** ఒక జాతి కంటె మరొక జాతి గొప్పదని అది భావించదు. "ఇందులో యూదుడని, గ్రీకు దేశస్థుడని భేదములేదు. దాసుడని స్వతంత్రుడని లేదు. పురుషుడని స్త్రీ అని లేదు; యేసుక్రీస్తు నందు మీరందరును ఏకముగా ఉన్నారు" (గలతీ 3:28).

క్రైస్తవ్యము వాగ్వాటిని, ఆడంబరత్వమును ప్రదర్శించునట్టిదికాదు. ఎదుటి వానిని నోటిమాటల ద్వారా పడగొట్టుడము దాని పనికాదు. క్రీస్తు స్థాపించిన, క్రొత్తనిబంధనలో యున్న మతము చెప్పినట్లు చేసేదే గాని చెప్పియు చేయనిది కాదు.

క్రైసత్వ్యము పై పై భక్తి **ప్రదర్శించు భావోద్రేకమతము కాదు.** ఆదివారమున పాటలుపాడుచు గంతులు వేసే మార్గము కాదు గాని సోమవారం అవసరంలోయున్న వానికి తమ సహాయ హస్తము అందించే మార్గము (లూకా 10:30-37).

క్రైస్తవ్యము యేమికాదో మనం గ్రహించగలిగితే అదేమిటో బహుశ బాగుగా తెలిసికొనగలము. నటించే వారి వలన గాక నిజక్రైస్తవుల వలన క్రీస్తు మార్గమును మనము మరింత విపులముగా తెలిసికొనగలము.

– రాబర్ట్ బ్రూక్స్

# "నేనున్నాను నన్ను పంపుము"

## ( Here I am, Send Me)

మన దేవుడు ప్రేమించు దేవుడై యున్నారు. తమ ప్రేమను ఎల్లవేళలా ప్రజలకు తెలియజేయగోరు దేవుడు. పాతనిబంధన కాలములో ఆయన తన ప్రేమను తెలియజేయుటకు గోత్ర కర్తలతోను, ప్రవక్తలతోను నేరుగా సంప్రదించారు. మన కాలములో ఆయన తన లిఖిత పూర్వక వాక్యము ద్వారా మాటలాడుచున్నారు. ఆయన ప్రేమను గూర్చి, శాసనములను గూర్చి మనం ఇతరులకు తెలియజేయాలని కోరుచున్నారు.

ప్రవక్తయైన యెషయా కాలములో దేవుడు తన ప్రజలైన ఇశ్రాయేలీయుల కొరక ప్రత్యేక వర్తమానము పంప గోరారు. ఆ వర్తమానము నందించుటకు ఆయనకు ఒకరు కావలసియుండెను. గనుక "మేమెవరిని పంపుదుము? మా కొరకు ఎవడు పోవును?" అని ఆయన అడుగగా, "నేనున్నాను, నన్ను పంపుమని" యెషయా జవాబిచ్చాడు (యెషయా 6:7-8). ఇతరులకు దేవుని చిత్తమును తెలియజేయుటకు తనవంతు పనిచేయుటకు అతడు సిద్ధముగా ఉన్నాడు.

దేవుని రక్షణ వర్తమానము నేడు ప్రజలకు తెలియజేయబడాలి. ఆయన దానులు "నేనున్నాను, నన్ను పంపుమని" చెప్పాలి. తార్సువాడైన సౌలు దేవుని పిలుపును విన్నప్పుడు, "నేను ఈ ప్రజల వలనను అన్యజనుల వలనను హాని కలుగకుండ నిన్ను కాపాడెదను. వారు చీకటిలో నుండి వెలుగులోనికి సాతాను అధికారము నుండి దేవుని వైపునకు తిరిగి "పాపక్షమాపణ పొందునట్లు నిన్ను వారి యొద్దకు పంపెదనని" ప్రభువు అతనితో చెప్పెను (అపో.కా. 26: 16 -18). సౌలు తన క్రియలతో నేనున్నాను, నన్ను పంపుమని తెలియ జేసాడు. మరియు తన శేషజీవితము నంతయు సువార్త ప్రకటించుటకు వినియోగించాడు. దేవుడు బాలుడైన సమూయేలును పిలిచినపుడు అతడు

ప్రభువా, "నీ దాసుడు ఆలకించు చున్నాడు, ఆజ్ఞయిమ్మనెను" (1 సమూ 3:10). ఇంకొక మాటలో ప్రభువా ఇశ్రాయేలీయులలో మీ పనిని చేయుటకు సిద్ధముగా యున్నాననెను.

'నేనున్నాను, నన్నుపంపుమని' మనం ఎందుకు చెప్పాలి? మొదటిగా, సువార్తను ఇతరులతో పంచు కొనుటలో మన వంతుపనిని మనం చేయాలి. "మీరు సమస్తజనులను నాకు శిష్యులనుగా చేయుడి" యని ఆయన యిచ్చిన ఆజ్ఞను మనం తీవ్రముగా పాటించాలి.

2. మనం ఆయన చిత్తాన్ని జరిగించుటకు వెళ్లినప్పుడు దేవుడు సంతోషిస్తారు. కొలస్సయులోని క్రైస్తవులు "ఆయన చిత్తమును పూర్ణముగా గ్రహించిన వారునై ప్రతి సత్కార్యములో సఫలులుగను, దేవుని విషయమై జ్ఞానమునందు అభివృద్ధి పొందుచు అన్ని విషయములలో ప్రభువును సంతోషపెట్టునట్లు" నడుచుకొనవలెనని పౌలు వారి కొరకు ప్రార్థించాడు.

3. ఆయనతో నిత్యము జీవించునట్లు ఇతరులు కూడ ఆయన వర్తమానమును వినాలి. "మీరును సత్యవాక్యమును అనగా మీ రక్షణ సువార్తను విని క్రీస్తునందు విశ్వాసముంచి, వాగ్దానము చేయబడిన ఆత్మచేత ముద్రింపబడిరి" (ఎఫెసీ 1:13).

4. ఆయన నామము మహిమ పరచబడ్తాది : "దేవుడు సత్యవంతుడని స్థాపించుటకును, అన్యజనులు ఆయన కనికరమును గూర్చి దేవుని మహిమ పరచుటకును క్రీస్తు సున్నతి గలవారికి పరిచారకుడాయెను. అందు విషయమై ఈ హేతువు చేతను అన్యజనులలో నేను నిన్ను స్తుతింతును, నీ నామ సంకీర్తనము చేయుదునని వ్రాయబడి యున్నది. మరియు అన్యజనులారా, ఆయన ప్రజలతో సంతోషించుడి అనియు మరియు సమస్త అన్యజనులారా ప్రభువును స్తుతించుడి, సకల ప్రజలు ఆయనను కొనియాడుదురు గాక అనియు చెప్పబడియున్నది" (రోమా 15:9-11).

5. ఆయన సంఘము అభివృద్ధి జెందును. హింసనొందుచున్న క్రైస్తవులు "సువార్త ప్రకటించుచు సంచారము చేసిరి" (అపో.కా. 8:4). మరియు సౌలు క్రైస్తవుడైన తరువాత సంఘములు బలపడెను. "కావున యూదయ గలిలయ సమరయ దేశములందంతట సంఘము క్షేమాభివృద్ధి నొందుచు సమాధానము కలిగియుండెను." ప్రభువు నందు విస్తరించు చుండెను (అపో.కా. 9:31).

"నేనున్నాను, నన్ను పంపుమను" మాటలకు యేసుక్రీస్తే ఒక గొప్ప ఉదాహరణగా యున్నారు. "నా యిష్టము నెరవేర్చుకొనుటకు నేను రాలేదు; నన్ను పంపిన వాని చిత్తము నెరవేర్చుటకే పరలోకము నుండి దిగి వచ్చితిని" అని ఆయన చెప్పెను (యోహాను 6:38). "నన్ను పంపిన వాడు నాకు తోడైయున్నాడు, ఆయన కిష్టమైన కార్యము నేనెల్లప్పుడును చేయుదును" అని ఆయన చెప్పెను (యోహాను 8:29). ఆయన ఆజ్ఞాపించిన సంగతులను చేయుచు ఆయనకు ప్రీతికరముగా సేవ చేయుదము గాక!

-కోలిన్ మెక్‌గీ


**ఉచిత బైబిలు కోర్సు**

**మీ యింటిలోనే ఉండి బైబిలు సత్యములను తెలిసికొనండి. మేమిచ్చు బైబిలు కోర్సులో చేరండి. పోస్టుద్వారా ఆ పాఠములను ఉచితంగానే పొంది దానిని పూర్తిచేయగానే ఒక బైబిలు గ్రంథమును ఉచితముగా పొందండి. దిగువ అడ్రసుకు నేడే వ్రాయండి.**

**సత్యవాణి**

పోస్ట్ బాక్స్ నెం. 80, కాకినాడ - 533 001.

ఫోన్ : 0884 x 2363722

# క్రీస్తుతో కూడ లేపబడిన వారు, దేవునిచే ఎంచుకొనబడిన వారు

## (Raised with Christ, Elect of God)

క్రీస్తుతో కూడ లేపబడిన వారి యొక్క గుణగణాలను సింపుల్‌గా కొలస్స 3:1-17 వచనములు వర్ణించు చున్నవి. అట్టి వారు దేవునిచే ఏర్పరచుకొనబడినవారు.

"మీరు క్రీస్తుతో కూడ లేపబడిన వారైతే పైనున్న వాటినే వెదకుడి. అక్కడ క్రీస్తు దేవుని కుడిపార్శ్వమున కూర్చుండి యున్నారు. పైనున్న వాటి మీదనే గాని భూసంబంధమైన వాటి మీద మనస్సు పెట్టకొనకుడి; ఏలయనగా మీరు మృతిపొందితిరి, మీ జీవము క్రీస్తుతో కూడ దాచబడి యున్నది. మనకు జీవమై యున్న క్రీస్తు ప్రత్యక్షమైనపుడు మీరును ఆయనతో కూడ మహిమయందు ప్రత్యక్ష పరచబడుదురు.

"కావున భూమి మీదనున్న మీ అవయవములను అనగా జారత్వమును, అపవిత్రతను, కామాతురతను, దురాశను, విగ్రహారాధనయైన ధనాపేక్షను చంపివేయుడి. వాటివలన దేవుని ఉగ్రత అవిధేయుల మీదకి వచ్చును. పూర్వము వారి మధ్య జీవించినప్పుడు మీరును వీటిని అనుసరించి నడుచు కొంటిరి. ఇప్పుడైతే మీరు కోపము, ఆగ్రహము, దుష్టత్వము, దూషణ మీనోట బూతులు అను వీటినన్నిటిని విసర్జించుడి. ఒకనితో ఒకడు అబద్ధమాడకుడి, ఏయలనగా ప్రాచీన స్వభామును దాని క్రియలతో కూడ మీరు పరిత్యజించి, జ్ఞానము కలుగు నిమిత్తము దానిని సృష్టించిన వాని పోలికె చొప్పున నూతన పరచ బడుచున్న నవీన స్వభావమును ధరించుకొని యున్నారు. ఇట్టివారిలో గ్రీసు దేశస్థుడని యూదుడని భేదము లేదు. పరదేశియని, సిధియనుడని, దాసుడని, స్వతంత్రుడని లేదుగాని క్రీస్తే సర్వమును అందరిలో ఉన్నవాడునై యున్నాడు.

"కాగా, దేవుని చేత ఏర్పరచబడిన వారును పరిశుద్ధులును, ప్రియులునైన వారికి తగినట్లు మీరు జాలిగల మనస్సును, దయాళుత్వమును, వినయమును, సాత్వికమును, దీర్ఘశాంతమును ధరించుకొనుడి. ఎవడైనను తనకు హానిచేసెనని యొకడనుకొనిన యెడల ఒకనినొకడు సహించుచు ఒకనినొకడు క్షమించుడి. ప్రభువు మిమ్మును క్షమించిన ప్రకారము మీరును క్షమించుడి. క్రీస్తు అనుగ్రహించు సమాధానము మీ హృదయములలో ఏలుచుండనియ్యుడి; అందుకొరకే మీరొక్క శరీరముగా పిలువబడితిరి; మరియు కృతజ్ఞులై యుండుడి. సంగీతములతోను, కీర్తనలతోను, ఆత్మ సంబంధమైన పద్యములతోను ఒకనినొకడు బోధించు, బుద్ధి చెప్పుచు కృపాసహితముగా మీ హృదయములలో దేవుని గూర్చి గానము చేయుచు సమస్త విధములైన జ్ఞానముతో క్రీస్తు వాక్యము మీలో సమృద్ధిగా నివసింప నియ్యుడి. మరియు మాటచేతగాని, క్రియచేత గాని మీరేమిచేసినను ప్రభువైన యేసు ద్వారా తండ్రియైన దేవునికి కృతజ్ఞతా స్తుతులు చెల్లించుచు సమస్తము ఆయన పేరట చేయుడి " (కొలస్స 3:1-17).

క్రైస్తవ జీవితాన్ని గూర్చి చెప్పు వచనములు ఇవి మాత్రమే కాదు గాని అవి క్రైస్తవుని యొక్క దైనందిన జీవితాన్ని వలు విధములుగా ప్రస్తావించు చున్నవి. నేటి ఆధునిక యుగంలో దేవుని వాక్యము కోరుచున్న అనేక సంగతులు మనకు కనబడవు. క్రైస్తవులు నూతన జీవిత విధానములో జీవించు నిమిత్తము ఈ లోకములో నుండి పిలువబడిన వారు. ఒకడు మానవ దృక్పధాన్ని బట్టి క్రైస్తవుడని పిలువబడవచ్చును గాని ఈ లేఖనములలో వర్ణించబడిన అనేక సంగతులను అతడు ఉల్లంఘించు చుండవచ్చును. మనం దేవుడు కోరునట్లుగా నడుచుకొనుటకు శ్రద్ధగా దేవుని వాక్యమును పాటించ వలెను. క్రీస్తుతో కూడ లేపబడి దేవునిచే ఏర్పరచబడిన వారమైతే అట్లు జీవించుటకు శ్రద్ధ కలిగియుండ వలెను.

- వేయిన్ బేరియర్

# సంక్షిప్త వార్తలు

2017 ఆగష్టు 4వ తేదీ నుండి 13వ తేదీ వరకు అమెరికా నుండి వచ్చిన సోదరుడు తిమోతి విల్బ్స్ గారు కాకినాడలో యుండి రిక్కీ గారి ద్వారా స్థానిక సంఘము ద్వారా గొప్ప సువార్త పనిసాగించిరి. 9,10,11 తేదీలలో కాకినాడ సత్యవాణిలో వారు ప్రత్యేక బైబిలు తరగతులు నిర్వహించి బైబిలు జాగ్రఫీని చిత్రపటముల ద్వారా ఆసక్తికరముగా బోధించిరి. ఆ సందర్భముగా ఇద్దరు యౌవనస్త్రీలు క్రీస్తులోనికి బాప్తిస్మము పొంది సంఘముతో చేర్చబడిరి.

2017 ఆగష్టు 13వ తేదీ సాయంత్రం సోదరి కవితా గూటం గారు, రోనీగూటం గారు, వారి సతీమణి హరిత గారితో కలసి అమెరికాకు ప్రయాణమై అక్కడకు సురక్షితముగా చేరుకొనగల్గిరి. 14వ తేదీన సాయంకాలం రిక్కీగూటం గారు పొలిషింగ్ ద పుల్‌పిట్ లెక్చర్‌షిప్‌లో పాల్గొనుటకు అమెరికా వెళ్ళిరి. అక్కడ మిగతా కుటుంబ సభ్యులతో కలసి ఒకవారం రోజులు ఆత్మీయ పండుగను జరిపించుకొనిరి. ప్రసిద్ధ బైబిలు పండితుల ఉపన్యాసములు విని తన్మయులైరి. రిక్కీ గారు సెప్టెంబరు 2వ తేదీ కల్లా కాకినాడ చేరుకొందురు.

2017 ఆగష్టు 29, 30 తేదీలో బెంగుళూరులో ఆల్ ఇండియా క్రీస్తు సంఘ బోధకుల సహవాస సదస్సు ఘనముగా జరిగెను. బెంగుళూరులో యున్న స్థానిక సంఘముల పెద్దలు, పరిచారకులు, సువార్తికులు చుక్కా బేకబ్ గారి సారధ్యములో ఈ సభలను ఘనముగా విజయవంతముగా నిర్వహించిరి. బెంగుళూరు కంటోన్మెంట్ స్టేషన్‌కు సమీపములో యున్న యునైటెడ్ తియోలాజికల్ కాలేజీ సువిశాల సుందర అవరణము ఆ రెండు దినములు క్రీస్తు సంఘస్థులతో నిండియుండగా అక్కడయున్న చక్కటి ఆడిటోరియంలో సహోదరులు ఆయా అశములపై చక్కటి విశ్లేషణ యిస్తూ సోదరులను ఆత్మీయ ఎదుగుదల విషయంలో ప్రోత్సాహము నిచ్చిరి.

క్రొత్తనిబంధన మాదిరిచొప్పున ప్రతి స్థానిక క్రీస్తు సంఘము పెద్దలను ఏర్పాటుచేయాలి. స్థానిక సంఘము ఆ స్థితికి ఎదగడానికి సువార్తికుడు నిర్విరామ కృషి చేయాలని ప్రతి ప్రసంగీకుడు హెచ్చరించుట జరిగినది. జాషువా గూటం గారు భారతదేశములో క్రీస్తు సంఘ చరిత్రను క్లుప్తముగా 40 నిమిషములలో వివరించగా విన్నవారు ఆశ్చర్యచకితులైరి. క్రైస్తవుడైన ప్రతివాడు శిష్యుడే గనుక ఇతడు యితరులను కూడ శిష్యులుగా చేసే బాధ్యత కలిగియున్నాడని భారతదేశ సంఘములలో లోపముగా యున్న పెద్దల స్థానములను భర్తీ చేయుటకు సంఘస్థులకు శిక్షణ యిచ్చుట ఎంతైన అవసరమని హెచ్చరించిరి. సోదరులు వాధినిలూకా,

యం,చంద్రశేఖర్, ప్రభుదాస్ (చెన్నై), కె.బి.బి.చంద్రపాల్, కె.జి.కుమార్, యం.సామ్యేలురాజు, అబ్రహాంలింకన్, రాజేంద్రప్రసాద్, వి.రాజు, జాషువా గూటం, వి.యస్.ఆర్.జయపాల్, వి.సహదేవ్, టి.వి.సాంసన్‌రాజు, ఆర్.సి.హెచ్.సద్గుణరావ్, దేవానంద్, టి.ప్రసన్న విజయకుమార్, టి.జ్ఞానసుధీర్ గార్లు వాక్యపరిచర్యలో పాల్గొనిరి. రెండవరోజు ముగింపులో జేకబ్ గారి వందన సమర్పణతో ప్రార్ధన పూర్వకముగా ఆల్ ఇండియా ప్రీచర్స్ వర్క్‌షాప్ (బెంగుళూరు) ముగిసెను.

బెంగుళూరులో ఆనందపురం, యం.ఆర్.ఎస్.పళ్య, కృష్ణరాజపురం, మతికెరె, దేవరాజ్ ఉర్స్ కోలనీలోయున్న స్థానిక సంఘ పెద్దలను సంఘసభ్యులను అందరు అభినందించిరి. ఆయా సంఘముల నుండి ఎంపిక చేయబడిన యువతీయువకులు ప్రతిక్షణం శ్రమించి అన్నీ సక్రమంగా, క్రమశిక్షణ పూర్వకంగా, మర్యాదగా జరిగేటట్లు చూచిరి. హాజరైనవారందరికీ పై సంఘములు ఉచిత వసతి, రుచి శుచి గల భోజనములను రెండు దినములు సరఫరా చేసిరి. సారధ్యము వహించిన చుక్కా జేకబ్ గారికి, కార్యక్రమ ప్రణాళికలో పాల్గొనిన వి. సహదేవ్ గారికి సత్యవాక్కు ద్వారా అభివందనములు తెలియజేయుచున్నాము.

RNI Regd. No. 69973/98
Postal Regd. No. AP/KD-02/2015-17

From :
**SATYAVAKKU**
P.O. Box 80, Kakinada - 533 001

Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambamurthy St., Kakinada - 533 004.